# అభినేత్రి

## కె. తాయారమ్మ

మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటింది ప్రచండబానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు బూదేవి ఓర్పుకి ఇదో పరీక్షలా అనిపిస్తోంది

ఆ ఎండలో బుజంమీద గిచ్చెన ఇంకో చంకలో వాల్ పోస్టర్ల చుట్టలు పెట్టుకుని నడుస్తున్నాడు శివుడు

వాడికి పదహారేళ్ళుంటాయి లావుగా పొట్టిగా దుంబులా వుంటాడు

వాడి వెనకే పేస్టు దబ్బా, చింకి గుడ్డపీలికలు పట్టుకుని నడుస్తోంది సాదు అమ్మ

ఆమెకి అరవై ఏళ్ళుంటాయి లావుగా, పొడవుగా వుంటుంది ముఖం అంతా గుంటలుపడి వికృతంగా వుంటుంది

ఆ ముఖంలో ఏ బావాలు ద్యోతకం కావు నడుస్తూ ఆయాసపడుతోంది ఆమె

ఒరే శివా! ఏ బొమ్మరా యిది? ప్రశ్నించింది ఆమె ఎప్పుడూ ఇలాగే ప్రశ్నిస్తూ వుంటుంది

వాడు సమాదానాలు చెప్తూ వుంటాడు

కాని ఈరోజు వాడు మౌనం వహించాడు

ఏరా శివా మాట్టాడవు? అంది సాదు అమ్మ తిరిగి

ఏంలేదే నీరసం ముంచుకొస్తూంది! ఇంత కష్టపడినా కూలి డబ్బులు కడుపు నింపవు! అయినా నీ కెందుకు? ఏ బొమ్మయినా నువ్వు చూడాలా పెట్టాలా? చిన్న విసుగు ధ్వనించింది శివుడి గొంతులో

కాదురా శివా ఇలా తెలుసుకోవడంలోనే నాకు ఆనందం వుంది!" అంది బరువుగా అడుగులు వేస్తూ

పాత బొమ్మేలేవే! ఈ డొక్కు సినిమా ఎవరు చూస్తారిప్పుడు?

ఏ బొమ్మరా అది? ఆసక్తిగా ప్రశ్నించింది సాదు అమ్మ

అభినేత్రి! చాలా పాత బొమ్మ! ఆ డబ్బా ఇలాతే! అంటూ పెద్ద గోడకి నిచ్చెన చేరబెట్టాడు శివుడు

అబినేత్రా? కాంచనశిల్ప నటించిన బొమ్మేనా? ఎన్నాళ్ళకొచ్చింది? ముప్పై ఏళ్ళక్రితం ఎలా విజయడంకా మ్రోగించిందిఈ సిన్మా! ఈ సినిమాతో టేకదూ కాంచనశిల్ప ఎవరెస్టు శిఖరాన్ని అదిరోహించింది! ఎక్కడచూసినా సన్మానాలూ, సబలూ ఆ వైబోగం, ఆ గొప్పతనం తలుచుకుంటూ వుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది

కాంచనశిల్ప ఒకనాటి అజంతాశిల్పం!

సాదుఅమ్మ నేత్రాలలో ఆనందబాష్పాలు తొణికిసలాడాయి

ఒరే శివా! నెమ్మదిగా పిల్చింది

ఏమిటన్నట్టు చూశాడు శివుడు

అభినేత్రి సిన్మా నాకు చూపించవూ? చిన్న అభ్యర్ధన తొంగిచూసింది సాదు అమ్మ గొంతులో

వింతగా చూశాడు శివుడు

ఇంతవరకూ ఎన్నో సినిమాలు వచ్చాయి ఈ హాలుకి కాని ఎప్పుడూ ఇలా అర్ధించలేదు సాదుఅమ్మ

చిన్నగా నవ్వుతూ చూశాడు శివుడు

సాదమ్మా నువ్వు సిన్మా చూస్తావా? ఏమిటి ఇట్టాంటి కోరిక కోరుతున్నావు? సిన్మాకి రమ్మంటే రావుకదే నువ్వు? ఓ పాత అరుగుమీద కూర్చుని వాల్‌పోస్టర్ బోర్లించి పేస్టు పూస్తూ అన్నాడు

అబినేత్రి సినిమా చూసితీరాలి శివా! అంది వాడిచేతికి పాత గుడ్డపీలిక అందిస్తూ

అలాగేలేవే! అన్నాడు వాడు దాన్ని గోడమీద అంటిస్తూ

చంకలో బిందెపెట్టుకుని వున్న ఓ పల్లెటూరి పిల్ల, ఆ పక్కనే అత్యంతాధునికంగా వున్న ఓ యువతి వేషాలలో కాంచనశిల్ప వెలిగిపోతోంది

మొదట పల్లెటూరిపిల్లగా వున్న ఓ స్త్రీ, తరువాత ప్రఖ్యాత సినీ నటిగా మారుతుంది

ప్రజావాహిని ప్రేమాభిమానాలలో ఓలలాడుతున్నా నిజ జీవితంలో మాత్రం ఏ సుఖ శాంతులకు నోచుకోని సినీనటి కధనే చిత్రంగా తీశారు ఒకనాటి ప్రముఖ సినీసంస్థవారు తరువాత వాళ్ళ ప్రతీ చిత్రంలోను కాంచనశిల్పే హీరోయిన్

ఓసారి వాల్‌పోష్టరు చేతితో తడిమిచూసింది కాంచనశిల్ప ముఖాన్ని చేతితో తాకి తనివితీరా ముద్దు పెట్టుకుంది

ఎంత అదృష్టవంతురాలివి తల్లీ! ఈనాటికీ ప్రజలచేత కొనియాడబడుతున్నావు! నిజజీవితంలో నీకు సుఖశాంతులు లేకపోయినా సినీప్రపంచంలో మాత్రం ఓ ధృవతారలా వెలిగిపోతున్నావు!

సాదుఅమ్మ కన్నుల నుండి నీళ్ళు జలజలరాలాయి

ఏమిటే పిచ్చి ముఖమా! ముందు నడు అన్నాడు శివుడు కొంచెం విసుగ్గా

సాదుఅమ్మ ప్రవర్తన వాడికి కొత్తగావుంది

ఉదయం ఆరు గంటలనించీ పదకొండు గంటల వరకు పక్క ఊరు టూరింగ్ టాకీస్‌వాళ్ళు అప్ప చెప్పిన బందరాముడు వాల్‌పోస్టర్లు అంటించాడు

అబినేత్రి వాల్‌పోస్టర్లు చాలా లేటుగా వచ్చాయి వాటిని అంటించడం ఇప్పుడే మొదలుపెట్టాడు సాయంత్రం వరకూ కాకుండా తెల్లార్లూ అంటించినా టైము చాలలేదు

తన ఉద్యోగంమీద తనకే విసుగు వచ్చింది శివుడికి

ఇద్దరూ ఓ చెట్టుకిందకి చేరి తమతో తెచ్చుకున్న చారు అన్నం తిన్నారు

ఒరే శివా! ఏ తల్లి కన్నబిడ్డవో? ని మంచిచెడ్డలు చూడాల్సిన బాధ్యత నాకు అప్పగించాడు ఆ దేవుడు అంది సాదుఅమ్మ తిన్న గిన్నెలు కడుగుతూ

పదే! ఇంకా బోల్డు పనుంది అన్నాడు శివుడు లేచినించుంటూ

వాణ్ణి అనుసరించింది సాదుఅమ్మ

సాదమ్మా నేనేకద నీ కింత కూడుపెడుతుంటిని! అన్నాడు శివుడు వెనుదిరిగి చూడకుండానే

నిన్నింతవాణ్ణి చేసిందెవర్రా శివా? అంటూ నవ్వింది సాదుఅమ్మ

ఇద్దరూ నవ్వుకున్నారు

అలా సాయంత్రం వరకూ వాల్‌పోస్టర్లు అంటించి ఇంటికి చేరుకునేసరికి రాత్రి ఎనిమిది గంటలు దాటింది

ఒరే మరి నేను నీతో పాటు తిరగలేను తొలికోడి కూసినప్పుడు లేచి అంటిద్దాం! అంతవరకూ నేను నిద్రపోతాను నువ్వు అన్నంతిని నిద్రపో అంటూ కటికనేలమీద కాషాయగుడ్డ పరుచుకు పడుకుంది సాదుఅమ్మ

ఏమిటో ఈమనిషి? అనుకుంటూ చెరువు స్నానానికెళ్ళాడు శివుడు

* * *

సాదుఅమ్మ ఆ ఊరు ఎప్పుడు వచ్చిందో ఎలా వచ్చిందో అందరూ మరచేపోయేరు సుమారు పాతికేళ్ళయ్యుంటుంది వచ్చి ఊరు మొదటవున్న పాడుపడిన శివాలయంలో వుంటుంది ఎప్పుడూ కాషాయ బట్టలే కట్టుకుంటుంది ఊరందరికీ తలలో నాలుకలా వుంటుంది ఎవరికే కష్టం వచ్చినా

ఆమెతో వచ్చి చెప్పుకుంటారు ఆ సమయంలో అందరికీ మంచిని బోధిస్తూ వుంటుంది

సాదమ్మా! ఇంద ఈ డబ్బులుంచు! అని ఎవరైనా అంటే

ఉచితంగా నేను ఏమీతీసుకోను బిడ్డా! అయినా సన్యాసిని నాకు డబ్బులెందుకూ? అంటుంది

రోజూ శివాలయం తుడుస్తుంది కళ్ళాపి జల్లుతుంది ముగ్గులు పెడుతుంది ఉదయ సాయంకాలాలు శివపురాణం చదువుతుంది

రాబడిలేని దేవుడిమీద సాదమ్మా నీ కెందు కింతభక్తి?" అంటారు కొందరు

నవ్వుతూ ఊరుకుంటుంది సాదుఅమ్మ

ఆ ఊరు పేరు శివాపురం

వెయ్యి గడపలుంటాయి అక్కడ

నిన్న మొన్నటి వరకూ టూరింగ్‌టాకీసుగా వున్న సిన్మాహాలు దనవంతుడైన వరహాలశెట్టి దర్మమా అని ఇప్పుడు రంగుల హరివిల్లులా తయారయ్యింది

ఇప్పుడా హాలుకి పాత కొత్త సినిమా లన్నీ వస్తున్నాయి

చుట్టుపక్కల అన్ని ఊళ్ళకీ అదే హాలు కావడం చేత హౌస్‌ఫుల్ కలక్షన్లు వస్తూ వుంటాయి

ఆ సినిమాహాలు పెట్టి పదిహేనేళ్ళయ్యింది హాలు పెట్టిన దగ్గరనించీ సాదమ్మే వాల్‌పోస్టర్లు అంటిస్తోంది రోజూ వచ్చే కూలి డబ్బులతో పొట్టనింపుకుంటోంది

ఆ వృత్తిలోనే ఆమెకు ఆనందం వుంది

ఎందుకు సాదమ్మా ఇట్టా కష్టపడతావు? హాయిగా నీడపట్టున వుండి రెండు గింజలు ఉడక పెట్టుకు తినరాదూ? నీ మంచితనానికి ఊళ్ళోవాళ్ళు ఆమాత్రం సాయం చెయ్యకపోతారా? అని ఎవరైనా అంటే వేదాంతిలా నవ్వుతుంది సాదు అమ్మ

హాల్లోకి ఎన్ని బొమ్మలొచ్చినా చూడదు ఛీ ఛీ వెదవ సిన్మాలు! గుడ్డలిప్పి గెంతుతున్నారు! ఒకనాటి సినిమాలు ఎంత బాగుండేవి? అనుకుంటుంది కొత్త పోస్టర్లు అంటిస్తున్నప్పుడు

సాదుఅమ్మకి అరవైఏళ్ళు దాటాయి ఇప్పుడు ఆమె డ్యూటీ శివుడు చేస్తున్నాడు అయినా వాడి వెనకే వెళ్తూ వుంటుంది

శివుడంటే ఆమెకి ప్రాణం

అసలు ఆ శివుడు ఎవరు?

సరిగ్గా పదహారేళ్ళక్రిందట శివాలయం పీడిలో ధ్వజస్తంభం దగ్గర ఓ పురిటికందుని వదేసి పోయిందో అభాగ్యురాలు

గుడ్డలలో చుట్టబెట్టివున్న ఆ నెత్తుటి కందను తీసి, శివుడు తనకిచ్చిన వరప్రసాదం! అనకుంటూ వాణ్ని పెంచి పెద్ద చేసింది

నువ్వు సన్యాసినివి! నీకు బిడ్డ ఎందుకు సాదమ్మా? పారేయ్! అని కొందరంటే-

ఈశ్వర వరప్రసాదం! అంటూ వాణ్ని గుండెకు అదుముకుంది ఒకనాడు

రోజులు దొర్లిపోతున్నాయి

శివుడు పెరిగి పెద్దవాడయ్యాడు

ఇప్పుడు వాల్‌పోస్టర్లు శివుడు అంటిస్తున్నాడు

* * *

అభినేత్రి సినిమా రిలీజయ్యింది జనం తండోప తండాలుగా వస్తున్నారు హౌస్‌ఫుల్ కలక్షన్లతో టికెట్లు అమ్ముడుపోతున్నాయి

ఐదురూపాయల టిక్కెట్లు పదిహేనుంచి ఇరవై వరకూ అమ్ముతున్నారు బ్లాకులో


పాతబొమ్మకే ఇంత ఎగబడిపోతున్నారేంట్రా? అని ఒకరంటే చూడు నీకే తెలుస్తుంది అంటున్నారు యింకొకళ్ళు

అమృతం చెవులకు సోకినట్టుంది సాదుఅమ్మకి కళ్ళతో పెదవులతో అతిసహజంగా నటించే కాంచనశిల్ప అంటే ప్రజాబాహుళ్యంలో గొప్ప క్రేజేవుంది

కాంచనశిల్ప సాదుఅమ్మ అబిమాన నటి

తాను ఏడుస్తూ ఎదుటివాళ్ళను ఏడిపిస్తూ తాను నవ్వుతూ ఎదుటివాళ్ళను నవ్విస్తూ వుండే కాంచనశిల్ప అంటే ఒక అనిర్వచనీయమైన ఆరాదన నిబిడీకృతమైవుంది సాదుఅమ్మలో






శివాలయం అరుగుమీద కూర్చుని ఒకనాటి కాంచనశిల్ప వైభవాన్ని సాదుఅమ్మ కళ్ళకుకట్టినట్టు వర్ణించి చెప్తూ వుంటే-

నీకూ రుచులున్నాయా సాదమ్మా? అంటూ నవ్వుతారు కొందరు కొంటికోణంగులు

ఆ యమ్మ గొప్పతనం మీకేం తెలుసురా? కుర్ర కుంకల్లారా' అంటూ నవ్వుతుంది సాదమ్మ

ఆ విషయం చెప్తున్నంతసేపూ ఆమె కళ్ళు వెలిగిపోతూనే వుంటాయి

రాత్రి పదిగంటలయ్యింది

శివాలయం అరుగుమీద కూచుంది సాదుఅమ్మ శివుడు ఊరెళ్ళాడు రెండు మూడు రోజులవరకూ రానన్నాడు పక్క ఊళ్ళన్నిటిలో వాల్‌పోస్టర్లు అంటించాలి

అభినేత్రి సినిమా ఎలాగైనా చూడాలి' అనుకుంది దృడంగా

ఇరవైరేళ్ళ బొమ్మ అది'

మొదటి ఆట సినిమా వదిలినట్టున్నారు ఇంకా అరగంట టైముంది పోనీ సిన్మాకెళ్తే?

శివుడుంటే సినిమాకి ఫ్రీగా తీసికెళ్తాడు తనకీ వాళ్ళందరికీ తెలిసినా బొమ్మ పాతపడితేకాని పాస్ ఇవ్వరు క్రితం రోజే వచ్చింది అబినేత్రి వారం రోజులవరకూ తనకి సినిమా చూసేయోగం లేనట్టుంది' అంతవరకూ తను ఆగలేదు

ఎలాగైనా బొమ్మ చూడాలి గుడిలో పలికిళ్ళి గూటిలో వెతికింది కొన్ని చిల్లరడబ్బులు దొరికాయి అప్పుడప్పుడు పదీ అయిదూ పైసలు అక్కడ దాస్తూ వుంటుంది

చిల్లర లెక్కపెట్టింది రెండురూపాయల పావలావుంది ఇంకో పావలా వుంటేకాని నేల టిక్కెట్టుకూడా రాదు

ఎవరో గుడిముందునించి వెళ్తూ వుంటే పావలా అడిగిపుచ్చుకుంది

ఎప్పుడూ అడగని సాదుఅమ్మ అడిగిందే తడవుగా డబ్బులిచ్చాడు అవతలవ్యక్తి

చీకటి రాత్రి దూరంగా నక్కలు రొద చేస్తున్నాయి

చేతికర్ర తీసుకుని బయలుదేరింది

సాదు అమ్మా ఎక్కడికెళ్తున్నావు? అడిగారు ఒకరిద్దరు

# అభినేత్రి

అభినేత్రి సినిమాకి'

చిన్నగా నవ్వుకున్నారు వాళ్ళు

ఏం? తను సినిమా చూడడానికి అర్హురాలు కాదా? మనస్సు బాదతో మూలిగింది

హాలు సమీపించింది సాదుఅమ్మ

దేదీప్యమానంగా వెలిగిపోతోంది ఆ ప్రదేశమంతా టిక్కెట్లదగ్గర బోలెడంత జనం గుమిగూడి వున్నారు వాళ్ళంతా నానా హంగామా చేస్తున్నారు తిట్టుకుంటున్నారు అరుస్తున్నారు ఏడుస్తున్నారు పాత బొమ్మకే ఏమిటో ఈగిరాకీ? అంటున్నారెవరో'

పాతబొమ్మయితేనేం? ఇప్పుడిలాంటి సిన్మా లొస్తున్నాయేంటి? అదీగాక కాంచనశిల్ప' లాంటి నటి ఏదీ ఇప్పుడు? ఇంకెవరిదో సమాదానం

సాదుఅమ్మ కళ్ళు వెలిగాయి

నిజమే కాంచనశిల్ప లాంటి నటి ఏదీ ఇప్పుడు?

కాంచనశిల్ప నిలువెత్తు పెయింటింగ్ ముందు చాలామంది జనం మూగివున్నారు

అపురూపసౌందర్యవతియైన కాంచనశిల్పని రెప్ప వాల్చకుండా చూస్తూ వుండిపోయింది సాదుఅమ్మ

ఎంతో బాగా అలంకరించారు ఆ పెయింటింగ్‌ని రంగు రంగుల లైట్లు వెలుగుతున్నాయి అక్కడ ఆ పెయింటింగునివరహాలశెట్టి ప్రత్యేకంగా మద్రాసు నించి తెప్పించాడు దాని ఖరీదు యాభైవేలు'

కాంచనశిల్ప విశాలనేత్రాలలో మధువులు కురుస్తూ వుంటాయి' అనుకునేవారు ఒకప్పుడు

ఆమె నవ్వులలో రతనాలు ఒలుకుతాయి అనుకునేవారు ఒకనాటి రసికశిఖామణులు అలాంటి కా ం చ న శి ల్ప ఎంతో నికృష్టంగా జీవితాన్ని ముగించింది

సన్నని తడి మెరిసింది సాదుఅమ్మ నేత్రాలలో దాన్ని సుతారంగా స్పృశించింది ఎంత అదృష్ట వంతురాలివి తల్లీ' ఎన్నాళ్ళయినా ప్రజామన్ననలు పొందుతున్నావు' అంది

ఆమె ఆలోచనల నుంచి తేరుకునేసరికి జనం పలచబడ్డారు

కళ్ళు వెడల్పుచేసి చూసి, ఒక్కసారి ఉలిక్కిపడింది

హౌస్‌ఫుల్ బోర్డు ఆమెను వెక్కిరించింది

ఉస్సురని నిట్టూర్చింది సాదుఅమ్మ

మల్లిగాడు రెండున్నర టిక్కెట్టు పది రూపాయలకి అమ్ముతున్నాడు

ఒరే మల్లిగా' నా కో టిక్కెట్టివ్వరా' అంది వాణ్ణి సమీపించి

ఏంది సాదమ్మా నీకు సిన్మా టిక్కెట్టు కావాలా? పదిరూపాయ లున్నాయా? అయినా నువ్వు సిన్మా కొచ్చేవేంటి? అన్నాడు ఆశ్చర్యపోతూ

కాంచనశిల్ప నా అభిమాన నటి' అభినేత్రి నాకు నచ్చిన సిన్మా' నేమా పదిరూపాలే ఇవ్వాల్రా?

ఒక్క టిక్కెటే వుంది సాదమ్మా' నాలుగు రోజులు ఓపికపట్టు ఫ్రీగా సినిమా చూద్దువుగాని అంటూ వాడు మరోవైపుగా వెళ్ళిపోయాడు

నిరాశానిస్పృహలతో వెనుదిరిగింది సాదమ్మ

* * *

సాదుఅమ్మ ఆలోచిస్తూ పడుకుంది ఎప్పుడూ తను సిన్మా చూడాలని కోరలేదు ఈ రోజు వెర్రికోరిక కలిగింది అయినా తన ఆశ తీరలేదు

అభినేత్రి సినిమా ఆమె అంతరంగంలో మెదిలింది చంగుచంగున గంతులేస్తూ వుండే వయస్సు కాంచనశిల్పది' ఒకప్పుడు మహోజ్వలంగా వెలిగింది కాని కాని కాలం ఆమెని కబళించింది

వెలుగు వెల్లువలు నిండిన ఆమె జీవితంలో కటిక చీకటులు కమ్ముకున్నాయి

ఒకనాడు కాంచనశిల్ప గురించి పత్రికలు ఎంత ఘనంగా రాశాయి' పేరుకు తగిన అందాలరాశి కాంచనశిల్ప

ఎందరో నిర్మాతలు ఆమె చుట్టూ తిరిగారు ఎందరో దర్శకులు ఆమె నటించబోయే చిత్రానికి దర్శకత్వం వహిస్తామన్నారు ప్రముఖ హీరోలు ఆమె పక్కన నటించడమే గొప్పవిషయం అనుకున్నారు

కోటీశ్వరులు ప్రముఖులు ఆమెను పెళ్ళాడుతామన్నారు కాని కాని కాంచనశిల్ప మనస్సులో మాత్రం రవిరాజ్ నిలిచిపోయాడు అతను బహుబాషానటుడు

సకలకళాకోవిదుడు స్ఫురద్రూపి

రవిరాజ్ మీరు లేని నా జీవితం లేదు' అంది కాంచనశిల్ప నటనలో శిఖరాగ్రాలను స్పృశించిన కాంచనశిల్ప వాస్తవంలో బేలగా మారిపోయింది

రవిరాజ్ ఆమె చెయ్యి అందుకున్నాడు ఎందరో చెప్పారు కాంచనశిల్పా కోరి ముళ్ళ దారంట నడుస్తున్నావు రాజమార్గంలో నడవరాదూ? అని

ఆ మోజులో ఆ మైకంలో కాంచనశిల్పకి మరో ప్రపంచం కనుపించలేదు

రవిరాజ్‌కి ఇదివరకే నలుగురైదుగురు బార్యలున్నారు వాళ్ళందరికీ పిల్లలున్నారు కాంచనశిల్పకీ రవిరాజ్‌కీ వయస్సులో ఇరవై ఏళ్ళు తేడా వుంది అయినా ఏమయ్యింది?

ప్రేమ గుడ్డిది'

ఆమె వైవాహికవిషయాన్ని పేపర్లూ, సినీ పత్రికలూ ఘనంగా ప్రచురించాయి

స్వర్గం ఎక్కడో వుండదు' అనుకుంది రవిరాజ్ తో డి అనుబంధాన్ని తలుచుకుని

అబ్బ' అంత ముసలాణ్ణి పెళ్ళాడారేమిటి కాంచనశిల్పా? నా లాంటి యువకులుండగా? అని ఒకరు రాస్తే,

పెళ్ళితో మీ మార్కెట్ పడిపోతుందేమో మేడమ్? మీరు లేని సినీప్రపంచం వ్యర్థం' అంటూ అబిమానుల ఉత్తరాల పరంపరలు

చిన్నగా నవ్వుకుని ఊరుకుంది కాంచనశిల్ప

పెళ్ళయిన తరువాత మరికొంచెం గ్లామరు పెరిగింది కాంచనశిల్పకి పుంఖానుపుంఖాలుగా సినిమాలు రిలీజయ్యాయి కాంచనశిల్పవి

రవిరాజ్ ఆకర్షణలో ఆమె జీవితం మదుర సంగీతాన్ని ఆలపించింది

కాంచనశిల్ప బిడ్డ తల్లి అయ్యింది

అబ్బ బిడ్డ తల్లి అయినా మీ అందం నశించి పోలేదు' నిజంగా మీరు కారణజన్ములు' అంటూ అభిమానులందరి దగ్గర నుండీ లేఖలు రాసాగాయి కాంచనశిల్పకి

కాంచనశిల్ప ఎడద ఏ మదుర లోకాలలోనో విహరించింది

రోజులు దొర్లిపోతున్నాయి

కాంచనశిల్ప కొన్ని కోట్లు అర్జించింది ఎన్నో బిల్డింగులు, మరెన్నో ఫ్యాక్టరీలు, నాలుగైదు కార్లు, ఇంకా వెండి, బంగారు నగలు, పూజా విగ్రహాలు చాలా ఎత్తుకి ఎదిగిపోయింది కాంచనశిల్ప

కాని కాలం ఎప్పుడూ ఒక్కలా వుండదు'

ప్రజల మనస్సు కొత్తరుచులవైపు మళ్ళింది ఈ సమయంలో దివ్య సినీరంగంలో ప్రవేశించింది సన్నగా మెరుపుతీగెలా వుండే దివ్య అంటే ప్రజలు వెర్రెత్తిపోయారు

కాంచనశిల్ప మార్కెట్ పడిపోయింది

కొత్త అందాల్ని ఆస్వాదించే రవిరాజ్‌కి ఫీల్డులో నిలదొక్కుకోవాలనుకునే దివ్యకి జత కుదిరింది

దివ్య అంటే పడిచచ్చే ప్రజలు మీరు ఆ వృద్ధ హీరోగారి ప్రేమవలలోనే చిక్కిపోయారా మేడమ్? అంటూ ప్రశ్న పరంపరలు కురిపించారు

ప్రేమ గుడ్డిది' అంటూ తప్పించుకుంది దివ్య కూడా

వృద్ధ నటుడు రవిరాజ్ మరో ప్రేమ పురాణం' ప్రముఖ సినీ పత్రికలన్నీ ప్రచురించాయి

దివ్యతో సరాగాలు జరుపుతున్న రవిరాజ్ చిన్నగా నవ్వుకున్నాడు

ఇది కర్ణాకర్ణిగా కాంచనశిల్పకి తెలిసింది

నన్నెందుకు మోసగించారు రవిరాజ్? అంది

నవ్వాడు రవిరాజ్

ఫలితం మత్తుపర్థాలకి అలవాటుచేశాడు అది లేకపోతే బ్రతకలేని స్థితికి వచ్చింది కాంచనశిల్ప

ఆమె ఆస్థి అంతా హస్తగతం చేసుకున్నాడు రవిరాజ్ ఆమె బిడ్డని ఏ దూరతీరాలకో పంపించేశాడు

తెలివిలో వున్నప్పుడు 'రవిరాజ్ నా ఆస్తి నా బిడ్డ అంటూ ఆక్రోశించసాగింది కాంచనశిల్ప

ఇప్పుడు పూర్తి మైకంలోనే వుండిపోతోంది కాంచనశిల్ప

పెద్ద బవనంలోంచి చిన్న ఇంట్లోకి మారింది ఆమె నివాసం

విదినిర్ణయాన్ని ఎవరూ తప్పించలేరు

అనతికాలంలోనే దివ్య బాగా లావెక్కింది ఆమె మార్కెట్ పడిపోయింది

అప్పుడు గుర్తొచ్చింది కాంచనశిల్ప ప్రజలకి కాంచనశిల్ప కావాలంటూ గగ్గోలు చేశారు

మేడమ్ మీరు మళ్ళీ నటించాలి' ఒక రిద్దరు నిర్మాతలు ఆమెను కోరారు ఉత్సాహం వెల్లివిరిసింది కాంచనశిల్పలో

నేను మళ్ళీ నటిస్తాను' రవిరాజ్‌తో అంది

ఆమె మళ్ళీ మామూలు మనిషి అయితే తన ఆస్తి అంతస్తూ అన్నీ కావాలంటుంది'

ఆమె మళ్ళీ నటి కాకూడదు రవిరాజ్‌లో క్రౌర్యం చోటుచేసుకుంది అంతే' ఆసిడ్ ముఖంమీద పోసి గోదారిలోకి నెట్టాడు

కాంచనశిల్ప చరిత్ర ముగిసిపోయింది

కాని నేటికీ తెరమీద కనిపించి అందరి మన్ననలు పొందుతూనేవుంది

బగవాన్' నీలీలలు చిత్రాతి చిత్రాలు సాదమ్మ కన్నుల నుండి నీరు అవిరామంగా వర్షించసాగింది

సాదమ్మా నిద్రరోతున్నావా? శివుడు పిలిచాడు

ఎంతసేపైంది శివా నువ్వొచ్చి? అంటూ లేచి వాడికి అన్నం వడ్డించింది

శివా' రేపు నాకు అబినేత్రి సినిమా చూపించవూ? అంది చాపమీద ఒరిగిపోతూ



Adworld/1107/87

అలాగేలేవే! ముందు నిద్దరో! అంటూ పక్కకి ఒత్తిగిలి పడుకున్నాడు శివుడు అవలిస్తూ

* * *

మర్నాడు శివుడికి విపరీతమైన జ్వరం వచ్చింది సాదుఅమ్మ ఒకర్తే మెల్లగా వాల్‌పోస్టర్లు అంటించసాగింది

అభినేత్రి ఇంకో భంగిమలు అవి

బొమ్మ పాతదయినా డబ్బు బాగా ఆర్జించి పెట్టిందివరహాలశెట్టి సార్థకనాముడైనాడు

రాత్రి తొమ్మిదిన్నర వరకూ పోస్టర్లు అంటించి ఇంటిముఖం పట్టింది సాదుఅమ్మ

ఒంట్లో ఏదో నిస్సత్తువ ఆవరించింది

శివుడికి జ్వరం ఎప్పుడు తగ్గుతుందో? తనకి అభినేత్రి సినిమా చూసే యోగం వుందో లేదో?

నిజానికి తను టిక్కెట్టు కొనుక్కో అక్కరలేదు రష్ ఎక్కువగా వుండడంచేత ఫ్రీగా చూడడం కుదరదు పోనీ ఎవరినైనాటికెట్ తీసిపెట్టమంటే హేళనచేస్తారు"

"పేరుకి కాషాయగుడ్డలు, ఆలోచనలు, కోరికలు మాత్రం ఏ రశికశిఖామణులకు తీసన్ని!" ఒక రిద్దరు గేలిచేశారు

గాఢమైన నిట్టూర్పు వెలువడింది సాదమ్మనుండి

ఎలాగైనా సిన్మా చూడాలి!

'శివా–నేను సిన్మాకెళుతున్నాను జావ కాచేను కావలసినప్పుడు తాగు' అంది సాదమ్మ గుడిదాటుతూ

ఒక్కదానివే పోగలవా? అన్నాడు శివుడు వణుకుతూ

ఫరవాలేదు! వీధిలోకి నడిచింది

చీకటి రాత్రి చేతికర్ర పొడుచుకుంటూ నడవసాగింది నాలుగు ఫర్లాంగులు నడిస్తేకాని హాలురాదు!

ఎక్కడో ఏదో సందడి వినిపిస్తోంది

ఇంకొక్క ఫర్లాంగు నడిస్తే హాలు సమీపించ వచ్చు మల్లిగాడు తనకు టిక్కెట్టు కొనివుంచుతానన్నాడు

ఆ కోలాహలం దగ్గరవుతోంది

సాదుఅమ్మ కళ్ళు రాత్రి అంతబాగా కనుపించవు

ఎదురుగా ఏదో ఊరేగింపు వస్తోంది

'ఏమైవుంటుంది?

మందు గుండు సామాన్లు ధనాధన మంటున్నాయి బ్యాండుమేళం చెవులు చిల్లులు పడేలామ్రోగుతోంది గ్యాసులైట్లు వెలుగు ముద్దల్లా తరలివస్తున్నాయి కర్రసాములవాళ్ళు వీరావేశంతో గంతులు వేస్తున్నారు. మధ్యమధ్యలో విజిల్స్, హాయ్, హాయ్ కేకలు, జనం తండోప తండాలుగా వస్తున్నారు

ఇసుకవేస్తే రాలనంత జనం

ఏమిటది?"

"అభినేత్రి; కాంచనశిల్ప కళాచిత్రాన్ని ఊరేగిస్తున్నారు

కళ్ళకి చేతులు అడ్డంపెట్టుకు చూసింది సాదుఅమ్మ కాంచనశిల్ప చిరునవ్వులు చిందిస్తోంది

సాదుఅమ్మ కళ్ళు గిర్రునతిరిగాయి

అడుగులు నేలమీదపడడంలేదు తనువు విచిత్రంగా ఊగిపోతోంది

ఊరేగింపు దగ్గరవుతోంది

తనింక సినిమా చూడలేదు!

పక్కకితప్పుకు నడవలేదు

ఒక్కసారి నేలమీదకి ఒరిగిపోయింది

ఎవరూ ఇది గమనించేస్థితిలో లేరు

జనం తొక్కిసలాటలో నేలకరుచుకుపోయింది సాదుఅమ్మ మనుష్యుల పాదాలక్రింద నలిగిపోయింది సాదుఅమ్మ దేహం

ఎవరో చెప్పారు శివుడికి

జ్వరంతో నే పరుగెత్తుకువచ్చాడు

కొనవూపిరితో కొట్టుమిట్టాడుతోంది సాదుఅమ్మ

"చెప్తే విన్నావుకాదు! ఇప్పుడేమయిందో చూడు" అంటూ బావురుమన్నాడు శివుడు

'శి వా.. !" స్పష్టంగా పిలిచింది సాదుఅమ్మ

శివుడు ఆమె దగ్గరగా వంగాడు

వాడి చెవిలో ఏదో చెప్పి, ప్రాణం విడిచిపెట్టింది సాదుఅమ్మ

క్షణకాలం వాడు ఆశ్చర్యంలో మునిగిపోయాడు ప్రజలకు తెలియని ఒక్క నిజం వాడికి తెలుసు!

ఆమె కాంచనశిల్ప! అని □

